క్లుప్తంగా

పురస్కార గ్రహీతలకు సత్కారం

దేవరుప్పుల/పాలకుర్తిటౌన్: చేనేత జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండా లక్ష్మణ్ బాపూజీ(కేఎల్‌బీ) పురస్కారాలతోపాటు నగదు రూ.25 వేలను అందుకున్న కోలుకొండకు చెందిన గూడూరు సొసైటీ చైర్మన్ రచ్చ కృష్ణమూర్తి, పాము భిక్షపతిలను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులవృత్తితో జీవనోపాధి పొందే కార్మికులు మారుతున్న కాలానుగుణంగా అప్‌గ్రేడ్ ఐతే ఉపాధితోపాటు ఉత్తములుగా తీర్చిదిద్దబడుతారని సూచించారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ ఏడీఏ చాడేశ్వరీ, డీఓ రజనీ, పాలకుర్తి సీడీ సత్తయ్య, జనగామ, దేవరుప్పుల, పాలకుర్తి మండలాల చేనేత సహకార సొసైటీ, పోపా ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల బారిన పడితే అనర్థాలు

దేవరుప్పుల: మత్తు పదార్థాల బారిన పడితే అనర్థాలను చవిచూస్తారని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో మత్తు పదార్థాలు, రోడ్డు నిబంధనలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై సృజన్‌కుమార్, పాఠశాల కరస్పాండెంటు బ్రదర్ జేసురాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే సత్ప్రవర్తన కలిగి ఉండాలని స్టేషన్‌ఘన్‌పూర్ సీఐ జి.వేణు అన్నారు. స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు 'యాంటీ ర్యాగింగ్–యాంటీ డ్రగ్స్'పై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు గురికావద్దన్నారు. ప్రిన్సిపాల్ కృతమూర్తి, పీడీ శ్రీనివాస్, రవీందర్, శ్రీకాంత్, పీఈటీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై అవగాహన

జనగామ రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సైబర్ క్రైం, ర్యాగింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై రాజేష్ అన్నారు. పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం

స్టేషన్‌ఘన్‌పూర్: షూటింగ్ బాల్ ఘన్‌పూర్ మండల కమిటీ అధ్యక్షుడిగా డివిజన్ కేంద్రానికి చెందిన మారెపల్లి ప్రసాద్ ఎన్నికయ్యారు. షూటింగ్ బాల్ జిల్లా కమిటీ సమావేశాన్ని ఘన్‌పూర్‌లో గురువారం నిర్వహించారు. జిల్లా చైర్మన్ ఇనుగాల యుగేందర్‌రెడ్డి, అధ్యక్షుడు మంద రమేశ్, ఉపాధ్యక్షులు బొజ్జపల్లి సుభాష్, పురమాని రజాక్, భూక్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి అన్నెపు కుమార్ ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా మారెపల్లి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నర్సింగోజు చందర్, ఉపాధ్యక్షులుగా కడారి క్రాంతి, ఒగ్గు రాజు, కో సెక్రటరీగా చింతకింది సుధాకర్, ఎండీ.షఫీర్, కోశాధికారి బూర్ల రమేష్, కార్యవర్గ సభ్యులుగా రాజారపు మహేందర్, ఎదునూరి రాజు, ఆకారపు అశోక్ ఎన్నికయ్యారు.

పట్టుదలతో చదవాలి



బచ్చన్నపేట: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి పట్టుదలతో చదవాలని, అప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని మండల కేంద్రంలోని వాణి పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కరుని సుమలత అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన మండలంలోని లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ నూకలనవ్యా నర్సిరెడ్డి కూతురు రమ్యకు గురువారం మెమెంటో అందించి అభినందించారు.

కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి

పాలకుర్తి టౌన్: వీధి కుక్కలతో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ, పాలకుర్తి జీపీ ప్రత్యేకాధికారి వసంత అన్నారు. గురువారం ఆమె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కుక్కకాటుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. అలాగే కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఆమె మొక్కలు నాటారు. ఎంపీడీఓ రాములు తదితరులు ఉన్నారు.

చిన్నపెండ్యాలలో..

చిల్పూరు: వీధుల్లో కుక్కలు కనబడితే వాటికి దూరంగా, జాగ్రత్తగా ఉండాలని హెచ్‌ఎం సంపత్ అన్నారు. చిన్నపెండ్యాల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గ్రామ పంచాయతీ కార్యదర్శి తౌటి శశికుమార్ అధ్యక్షతన కుక్కకాటు.. నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

టిప్పర్ల అడ్డగింత

రఘునాథపల్లి: రియల్ వ్యాపారులు గుట్టలు లూటీ చేస్తూ విచ్చలవిడిగా మట్టి తరలిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని అశ్వరావుపల్లి గ్రామస్తులు గురువారం టిప్పర్లను అడ్డుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగరాజు, కొమురయ్య, భిక్షపతి, బుచ్చయ్య, దిలీప్, నవీన్, రాజు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామాల్లో ప్రతీఒక్కరు తమవంతు బాధ్యతగా తప్పనిసరిగా పరిసరాల శుభ్రతను పాటించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మధుసూదన్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని స్టేషన్‌ఘన్‌పూర్, రాఘవాపూర్, మీదికొండ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ముందుగా జీపీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంపై అంగన్‌వాడీలు, ఆశలు, ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పరిసరాలను శుభ్రం చేయించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈజీఎస్ ఏపీఓ ప్రేమయ్య, ఘన్‌పూర్ ఈఓ సత్యనారాయణ, రాఘవాపూర్, మీదికొండ కార్యదర్శులు అనురాధ, అశోక్, దామెర రవి, స్వామి, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ యూపీహెచ్‌సీలో..

స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ వీరాంజనేయులు ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ సత్యనారాయణ, వైద్యులు జనార్దన్, సంధ్య పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

బచ్చన్నపేట: అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ మల్లికార్జున్ అన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన



స్టేషన్‌ఘన్‌పూర్: పాఠశాలలో మొక్కనాటి నీరుపోస్తున్న ఎంపీడీఓ మధుసూదన్

పాల్గొని మాట్లాడారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు పరిశుభ్రత, అంటువ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంతోపాటు పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

పాలకుర్తి టౌన్/దేవరుప్పుల: పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పాలకుర్తి, దేవరుప్పుల మండల కేంద్రాల్లోని పోలీస్‌స్టేషన్లావరణంలో ఆయన పోలీసులతో కలిసి మొక్కలు నాటారు. సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, ఎస్సైలు బండి శ్రవణ్‌కుమార్, సృజన్‌కుమార్, లింగారెడ్డి, ఏఎస్సై రాజిరెడ్డి, శ్రీనివాస్, సదానందం రాజ్‌కుమార్, యాకయ్య, ప్రశాంతి, మారయ్య పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: పోలీస్‌స్టేషన్‌లో దేవాలయం వాతావ



పాలకుర్తి టౌన్: పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఏసీపీ, సీఐ తదితరులు

రణం కనిపించాలని నర్మెట సీఐ సాయి రమణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కంకల సతీష్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిసరాలు పచ్చని చెట్లతో నిండి ఉండాలని, మొక్కలను నాటి వాటికి క్రమం తప్పకుండా నీరు పట్టాలన్నారు. కానిస్టేబుళ్లు యాదగిరి, రాకేష్, అనిల్ పాల్గొన్నారు.

శునకాలకు 'రేబిస్' వ్యాక్సినేషన్

తరిగొప్పుల: మండలంలోని కొత్తతండా గ్రామపంచాయతీ పరిధిలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పశువైద్యాధికారి శశాంక్‌రెడ్డి ఆధ్వర్యంలో వీధి శునకాలకు రేబిస్ వ్యాక్సిన్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శశాంక్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తతండా పరిధిలోని పలు తండాల్లోని 28 వీధి శునకాలకు రేబిస్ వ్యాక్సిన్ ఇచ్చామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్ వనిత, గోపాల మిత్ర మూల నాగరాజు పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిల్పూరు: ప్రభుత్వం అందించే పథకాల విషయంలో అధికారులు, నాయకులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో గురువారం 58 మంది లబ్ధిదారులకు రూ. 17.16 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అవినీతిరహిత పాలన అందించడమే ధ్యేయంగా పనిచేస్తామని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి మాధవీలత, ఎంపీడీఓ బర్మావత్ శంకర్ నాయక్, నాయబ్ తహసీల్దార్ రామారావు, ఆర్‌ఐ శ్రీనివాస్, ఉపాధిహామీ ఏపీఓ మోహన్‌రావు, పొట్లపల్లి శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మొక్కలను నాటి చెట్లుగా ఎదిగేవరకు వాటిని కాపాడాలని ఎమ్మెల్యే శ్రీహరి విద్యార్థులకు సూచించారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే.. అధికారులు, విద్యార్థులు, నాయకులతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. జనగామ రూరల్ సీఐ ఎదవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, ఉపాధిహామీ ఏపీఓ మోహన్‌రావు, ఎంపీడీఓ శంకర్‌నాయక్ ఉన్నారు.

పరామర్శ

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గడ్డం నారాయణ (65), చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన తాళ్లపల్లి రమేశ్‌లు గురువారం అనారోగ్యాలతో మృతి చెందారు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీహరి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

మెరిట్ విద్యార్థినికి చేయూత

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లికి చెందిన రావుల కవిత, నాగన్న దంపతుల కుమార్తె అఖిల ఈ ఏడాది జరిగిన ఏపీ ఈ సెట్‌లో ఉత్తమ ప్రతిభతో ఈఈఈ విభాగంలో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. కాగా, విద్యార్థినికి పాలిటెక్నిక్ కళాశాలల పూర్వ విద్యార్థులు తమవంతుగా ఆర్థికంగా చేయూతను అందించేలా ప్రోత్సాహక బహుమతిగా రూ.30వేలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థి, చీఫ్ డిజైన్ ఆర్కిటెక్ట్ మంగు వేదప్రకాశ్ మాటాడుతూ పేద కుటుంబానికి చెందిన అఖిల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివి ఏపీ ఈసెట్‌లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించడం సర్వత్రా అభినందనీయమన్నారు. విద్యార్థి దశలోనే భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. రావుల రాంగోపాల్‌రెడ్డి, జి.సత్యనారాయణ, లింబగిరి వర్మ, సంజీవ్‌కుమార్, రాజుల దేవి, ఎడ్ల రాజేందర్, వెంకట్, అనీల్‌కుమార్, కోటిరెడ్డి, అంజన్‌కుమార్, ప్రదీప్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు అర్హులకు 'డబుల్' ఇళ్ల కేటాయింపు

దేవరుప్పుల: ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను గ్రామ సభల ద్వారా అర్హులను గుర్తించి కేటాయిస్తామని జనగామ ఆర్డీఓ కొమురయ్య సూచించారు. గురువారం మండల కేంద్రంలో కస్తూర్బా హాస్టల్ పక్కన నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లల్లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎస్సీ సామాజిక కుటుంబాలు చేరి ఉంటూ పలు మౌలిక వసతులు మెరుగుపర్చుకున్నారు. ఈ క్రమంలో స్థానిక అధికారులు నిబంధనల మేరకు కేటాయిస్తామని తెలిపినా కొలిక్కి రాకపోవడంతో రెవెన్యూ, హౌజింగ్, పోలీసు ఉన్నతాధికారులు సందర్శించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా డబుల్‌బెడ్రూంలు ఆక్రమించుకోవడం సరికాదని,



ఇళ్లలో చేరిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న కొమురయ్య

వెంటనే ఖాళీ చేయాలన్నారు. ఈ విషయమై అధికారులకు, ఎస్సీ కుటుంబాలకు కొంత చర్చ జరిగిన తరుణంలో ఈ నెల 28 వరకు గడువు ఇవ్వాలని కోరగా అధికార యంత్రాంగం సానుకూలంగా స్పందించి వెళ్లిపోయారు. తహసీల్దార్ హుస్సేన్, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, హౌసింగ్ డీఈ సౌజన్య, ఎస్సై సృజన్‌కుమార్, ఆర్‌ఐ రాజు పాల్గొన్నారు.

'సీఐ, ఎస్సైలను సస్పెండ్ చేయాలి'

నర్మెట: న్యాయవాదులు అమృతరావు, కవిత దంపతులపై దాడికి పాల్పడిన జనగామ సీఐ రఘుపతి రెడ్డి, ఎస్సై తిరుపతిలను తక్షణమే సస్పెండ్ చేయాలని ఎమ్మెస్పీ జిల్లా నాయకుడు కంతి చరణ్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొంపెల్లి అంబేద్కర్ డిమాండ్ చేశారు. ఈ సంధర్బంగా స్థానిక చౌరస్తాలో గురువారం నిరసన తెలిపిన అనంతరం వారు మాట్లాడారు. మహిళ అని చూడకుండా దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా చట్టరీత్యా వారిపై చర్యతీసుకోవాలన్నారు. లింగాల కనకస్వామి, గడ్డం రవి, జంజాల ప్రతాప్, బొడికె లక్ష్మయ్య, బొడికె ఎల్లయ్య, అక్కల వెంకటయ్య, పగిడిపాటి దాస్, కొలెపాక సూర్య, గాదెర బన్ని, గడపురం వెంకటయ్య పాల్గొన్నారు.

తేలుకాటుతో వ్యవసాయ కూలీ మృతి

- నొప్పి తాళలేక క్రిమిసంహారక మందు తాగిన వైనం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని కోమటిగూడెం గ్రామానికి చెందిన దాసరి యాదగిరి(55) అనే వ్యవసాయ కూలీ తేలుకాటుకు గురి కావడంతో పాటు క్రిమిసంహారక మందుతాగి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరి కట్టె కొట్టే పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం పనిలో ఉండగా ఎర్రతేలు కరిచింది. తీవ్ర నొప్పితో పాటు మంటగా ఉండగా గ్రామస్తుల సలహా మేరకు గ్రామంలోనే నాటువైద్యం చేసుకున్నాడు. రాత్రి నిద్రించే సమయంలో తేలు కుట్టిన చోట మంటగా, తీవ్ర నొప్పిగా ఉండటంతో భరించలేక ఇంట్లోని క్రిమిసంహార మందు తాగాడు. అర్ధరాత్రి సమయంలో పురుగుల మందు వాసన రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు విషయం తెలుసుకుని చికిత్స నిమిత్తం ఆటోలో జనగామ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. కాగా, ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని సీఐ వేణు తెలిపారు.



యాదగిరి (ఫైల్)

బుద్ధదేవ్ భట్టాచార్య మృతి తీరని లోటు

జనగామ రూరల్: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి సీపీఎంకు తీరని లోటు అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బూడిద గోపి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భట్టాచార్య స్ఫూర్తితో ప్రజా పోరాటాలు చేయాలని అన్నారు. అహల్య, విజేందర్, ఉపేందర్, లింగం, కళ్యాణి, లలిత, మైబెల్లి, రజిత, శ్రీలత, కనకయ్య, బుచ్చవ్వ, దానమ్మ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

సాక్షి నెట్‌వర్క్: అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ పంచాయతీ కార్మికులు మండలపరిషత్ కార్యాలయాల ఎదుట గురువారం ఒక్కరోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో పాలకవర్గాల నిర్లక్ష్యవైఖరి తగదన్నారు. పంచాయతీ సిబ్బంది పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, రెగ్యులరైజ్ చేయాలని నినాదాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు, సంఘం నాయకులు, జీపీ కార్మికులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: సమ్మెలో పాల్గొన్న జీపీ కార్మికులు



పాలకుర్తిలో..



దేవరుప్పులలో..



నర్మెట: నినాదాలు చేస్తున్న కార్మికులు

ఆకట్టుకుంటున్న కేఆర్‌సీ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌లో ప్రజల సందడి



జాయింట్ వీల్

జనగామ: జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కేఆర్‌సీ ఎగ్జిబిషన్ పట్టణ ప్రజలతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలను ఆకట్టుకోవడంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతోంది. ప్రతి రోజు సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకు కుటుంబ సమేతంగా తరలి వస్తున్న వారితో సందడి నెలకొంది. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ప్రత్యేకతను చాటుకుంటున్న తెలంగాణ సచివాలయం నమూనాతో పాటు జాయింట్ వీల్, బ్రేక్ డాన్స్, సోలంబో, డ్రాగన్ ట్రైన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో, రౌండ్ జువెలరీ, స్టాల్స్, రెడీమేడ్ స్టాల్స్, డ్రైఫ్రూట్స్ ఇలా అనేక రకాల వెరైటీ ఫుడ్ స్టాల్స్ అందరిని ఆకర్శిస్తున్నాయని ఎగ్జిబిషన్ నిర్వాహకులు నారాయణ తెలిపారు.

సన్మానం



రఘునాథపల్లి: రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న హెడ్‌కానిస్టేబుల్ బానోత్ సారంగం, కానిస్టేబుల్ గణపురం రాజులను ఎస్సై డి.నరేష్, పోలీసులు గురువారం స్టేషన్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విధి నిర్వహణలో చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయన్నారు. ఏఎస్సై ఉబేదుల్లా, హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాస్, శ్రీనివాస్, కానిస్టేబుల్స్ కుమారస్వామి, శ్రీనివాస్, వీరన్న, కవిత పాల్గొన్నారు.

వేపలగడ్డతండాలో సమస్యల తిష్ట

- వెలగని వీధి లైట్లు
- కానరాని స్వచ్ఛదనం–పచ్చదనం

రఘునాథపల్లి: మండలంలోని వేపలగడ్డతండాలో అధికారుల పాలనలో సమస్యలు తిష్టవేశాయి. మురుగు నీరు రోడ్లపై ప్రవహించడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వర్షం పడితే రోడ్లపై నీరు నిలిచి మరింత అధ్వానంగా మారడంతో మురుగు నీటిలోనే గ్రామస్తులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మురుగు నీటి నిల్వలు, రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తా చెదారం.. దోమలకు ఆవాసంగా మారాయి. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్‌తో చెత్త సేకరణ చేయడం లేదని, మూడు నెలలుగా వీధి లైట్లు వెలగడం లేదని, రోడ్లకు ఇరువైపులా శుభ్రతకు నోచుకోవడం లేదని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించలేదన్నారు. సమస్యలు పంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి తెలిపినా ఎటువంటి ఫలితం లేకుండా పోతుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మురుగు నీటిని చూపుతున్న స్థానికులు

పంచాయతీ కార్యదర్శి కవితను వివరణ కోరగా జీపీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు సరిగా చేయక పోవడంతో అపరిశుభ్రత నెలకొందని, వీధిలైట్ల సమస్య అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

నియామకం

చిల్పూరు: మండలంలోని వంగాలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అరూరి ప్రణిత బీజేపీ ఓబీసీ మోర్చా మండల మహిళా అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం జిల్లా అధ్యక్షుడు అరుట్ల దశమంతరెడ్డి ప్రకటించారు.

రక్తదానం

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డిల వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో జనగామ ఏరియా ఆస్పత్రిలో గురువారం నాయకులు రక్తదానం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: ఝాన్సీరెడ్డి,రాజేందర్‌రెడ్డి దంపతుల పెళ్లి రోజు వేడుకలను మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మాజీ మార్కెట్‌చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, నాయకులు కేక్ కట్ చేశారు.

పండ్ల పంపిణీ

కొడకండ్ల: హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి–ఝాన్సీరెడ్డిల వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని రోగులకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజేష్‌నాయక్,యాకయ్య, అబ్దుల్లా, యాకేష్, రవిందర్, శ్రీవర్ధ, అమరేందర్‌రెడ్డి, మదుసూధన్, వీర్యానాయక్, యాకూబ్‌నాయక్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సేవలతోనే గుర్తింపు

రఘునాథపల్లి: ఉపాధ్యాయులుగా విద్యార్థులకు అందించిన సేవలు ఎప్పటికి గుర్తింపునిస్తాయని మండల నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోమళ్ల ప్రాథమిక పాఠశాలలో 13 ఏళ్లుగా సేవలందించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు టి.సారయ్య, సీహెచ్ లక్ష్మిలను గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి, హెచ్‌ఎం జాన్‌సుందర్‌రావు, ఉపాధ్యాయులు సంతోష్‌రెడ్డి, మాధవి, పుష్ప, అన్నపూర్ణ, సురేష్, కమలాకర్, గ్రామస్తులు అనిల్, రేణుక, స్వప్న, రమ పాల్గొన్నారు.

మంద కృష్ణకు ఘన స్వాగతం పలకాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్సీ వర్గీకరణ రథ సారథి మంద కృష్ణ మాదిగకు ఈనెల 13న హైదరాబాద్‌లో ఘనస్వాగతం పలుకాలని ఎమ్మార్పీఎస్ మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ అన్నారు. డివిజన్ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 ఏళ్లుగా ఎస్సీల వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహానేత మంద కృష్ణ అని కొనియాడారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు కొయ్యడ మల్లేష్, రవీందర్, శ్రీనివాస్, సుధాకర్, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన కురాం ఉమేష్ ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి గాయపడి చికిత్స పొందుతున్నాడు. కాగా, బాధితుడిని సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ పరామర్శించి రూ.5 వేల సాయం గురువారం అందజేశారు. కొప్పురపు రమేష్‌రెడ్డి, తేలు కిష్టయ్య, చెవిటి రామయ్య ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

పాలకుర్తి టౌన్: పాలకుర్తి గ్రామ పంచాయతీకి ప్రత్యేకాధికారిగా డీఆర్‌డీఏ పీడీ ఎస్.వసంత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన మొగులప్ప నారాయణపేటకు బదిలీ కావడంతో వసంత బాధ్యతలు చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కపిలవాయి వెంకటేశ్వరచారి తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.

గోదావరి జలాలతో చెరువులు నింపాలి

బచ్చన్నపేట: మండలంలోని చెరువులు, కుంటలను గోదావరి జలాలతో నింపాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ వర్షాలు సరిగా కురవక చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదన్నారు. దీంతో అన్నదాతలు వరి నాట్లు వేయలేదని చెప్పారు. నార్లు కూడా ఎండిపోతున్నాయని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి గోదావరి జలాలతో చెరువులు, కుంటలను నింపాలన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కొడకండ్ల: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యాధులు దరి చేరకుండా జాగ్రత్త వహించవచ్చని సూపర్‌వైజర్ సరళ, హెచ్‌ఎం అందె సుధాకర్ అన్నారు. గురువారం పాకాల అంగన్‌వాడీ కేంద్రం–2లో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించి, పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోట బయ్యన్న, సుకన్య, ఆశ కార్యకర్త గాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరి నాటు వేసి నిరసన

తరిగొప్పుల: చిన్నపాటి వర్షానికే మట్టిరోడ్డు బురదమయంగా మారడంతో బీజేవైఎం నాయకులు అందులో గురువారం నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలకు బంజరుపల్లిలోని 10 వార్డుతో పాటు, దేశ్యాతండా మట్టి రోడ్డంతా బురదమయంగా మారి నడవడానికి వీలులేకుండా తయారైందని తెలిపారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు.